క్లుప్తంగా

అంగన్‌వాడీలో దీపావళి వేడుకలు



ఊట్కూరు: మండలంలోని ఎర్గాట్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ముందస్తు దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ సావిత్రిబాయి అంగన్‌వాడీ కేంద్రంలో రంగురంగులతో ముగ్గులు వేసి దీపాలు వెలిగించి వేడుకలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు మిఠాయిల పంపిణీ చేశారు.

బీఎస్పీ ఇంటింటి ప్రచారం

మరికల్: మండల కేంద్రంలో బీఎస్పీ అభ్యర్థి శ్రీనివాస్ శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ.. బహుజన రాజ్యం రావాలంటే ప్రజలు బీఎస్పీకి ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చంద్రయ్య, రాము, శేఖర్, వెంకటయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

దుష్ప్రచారం సరికాదు..

నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ సర్పంచ్ సుగంధమ్మ, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యులు కోట్ల జగన్మోహన్‌రెడ్డిలు కాంగ్రెస్‌లో చేరారంటు డీసీసీ నోట్ అంటు చేస్తున్న దుష్ప్రచారాలు సరికాదని వారు శనివారం విమర్శించారు. తాము బీఆర్‌ఎస్‌లోనే ఉన్నామని, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు.

విద్యార్థినికి అభినందన

నారాయణపేట రూరల్: మండలంలోని పిల్లిగుండ్లతండా పంచాయతీ పాతతండాకు చెందిన గిరిజన విద్యార్థినీ రజిత జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెలలో ఉత్తర్‌ప్రదేశ్‌లో నిర్వహిస్తున్న రెజిలింగ్ పోటీలకు హాజరుకానున్నారు. ఈ మేరకు శనివారం తండాకు వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి రజితను శాలువాతో సన్మానించి అభినందించారు.

కొనసాగుతున్న కాంగ్రెస్ ప్రచారం

సాక్షినెట్‌వర్క్: మరికల్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి పర్ణికారెడ్డిని గెలిపించాలని శనివారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. అలాగే దామరగిద్దలో ప్రజా సంక్షేమపాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ నాయకుడు కుంభం శివకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కాన్‌కుర్తిలో అభ్యర్థి పర్ణికారెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేసి మెనిఫెస్టోలోని ఆరు గ్యారంటీలను వివరించారు. అదేవిధంగా ధన్వాడలో మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ అభ్యర్థి పర్ణికారెడ్డి ప్రచారం చేసి ప్రజలు ఈసారి తనను ఆశీర్వదించాలని కోరారు.

అభివృద్ధి చూసి ఆశీర్వదించండి

కోస్గి: నియోజకవర్గంలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని ఆయా గ్రా మాల్లో పర్యటించి ఇంటింటి ప్రచారం చేసి అభివృద్ధిచూసి ఆశీర్వదించాలని ఓటర్లను కోరారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

ఊట్కూరు/మక్తల్: బీఆర్‌ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలను పార్టీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు వివరించాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రచారంచేసి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. అలాగే మక్తల్‌లో కుర్వ కులస్తుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మక్తల్ పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన కుర్వకులస్తుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు.. మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహాగౌడ్, బీఆర్ఎస్ నాయకుడు రాజుల ఆశిరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందిస్తాం



ఆత్మకూర్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపడుతుందని మక్తల్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. అశ్విన్‌కుమార్, మేర్వరాజు, అశోక్‌జీ, రేచింతల శ్రీను, క్యామ భాస్కర్, నాగేందర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, శ్రీధర్ రెడ్డి, చిన్న నర్సింహ,రఘుయాదవ్ ఉన్నారు.

నర్వ: మండల కేంద్రంలోని శుక్రవారం వివిధ పార్టీలనుంచి కార్యకర్తలు, నాయకులు బీజేపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి జలంధర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం నర్సింహులు, కాంగ్రెస్ నాయకులు డ్రైవర్ బుచ్చన్న, కట్ట నర్సింహులుతోపాటు పలువురు పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి నాయకులు నరేందర్‌రెడ్డి, హన్మంతరెడ్డి, అయ్యన్న, రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఊరించి.. ఉసూరు!

- రోజురోజుకూ తగ్గుతున్న పత్తి ధరలు
- పది రోజుల క్రితం రూ.7,800
- తాజాగా రూ.7,200 మించని వైనం
- వర్షాలు లేక తగ్గిన దిగుబడులు



గుడిగండ్ల జిన్నింగ్‌మిల్లు వద్ద జరుగుతున్న పత్తి కొనుగోళ్లు

మరికల్: జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తిపంట దిగుబడి ఆశించిన మేర రాలేదు. మొదట్లో విత్తనాలు నాటిన సమయంలో వర్షాలు లేక రైతు రెండు లేక మూడుసార్లు విత్తనాలు నాటాల్సిన పరిస్థితి వచ్చింది. మొదటి నుంచి పత్తిపంటకు సరిపడే వర్షాలు లేకపోవడంతో ఎకరాకు 12 క్వింటాళ్లు రావాల్సిన చోట కేవలం 5 క్వింటాళ్ల దిగుబడి రావడంతో పెట్టుబడులు రాని పరిస్థితి ఏర్పడింది. మార్కెట్‌లో పత్తిధరలు స్థిరంగా లేకపోవడంతో రైతులు విక్రయానికి ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది దిగుబడి గణనీయంగా పడిపోవడంతో ఉన్న పత్తికైనా అధికంగా ధర పలికితే అమ్ముకోవాలనే భావనలో రైతులు ఉన్నారు. ప్రస్తుతం రాయిచూర్ మార్కెట్‌లో పదిరోజుల నుంచి ధరలు పెరుగుతు తగ్గుతు రావడంతో రైతులు ఆందోళనలో పడ్డారు. పదిరోజుల క్రితం రూ.7,830కి పలకగా.. జిల్లాలోని జిన్నింగ్ మిల్లులో మాత్రం క్వింటాల్ పత్తి రూ.7,400 పలికింది. ప్రస్తుతం రాయిచూర్ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి రూ.7200, ఉండగా జిల్లాలో రూ.6,800 పడిపోయింది.

ముంచిన వర్షాలు..

జిల్లాలోని 13 మండలాల్లో వానాకాలం సీజన్‌లో 1.87 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పత్తిని సాగుచేశారు. జూన్ నెలలో కురిసిన తొలకరి వర్షాలకు రైతులు విత్తనాలు నాటారు. ఆ తర్వాత కొద్ది రోజులకే వర్షాలు ముఖం చాటేయడంతో వేసిన విత్తనాలు మాడిపోయాయి. రెండు, మూడుసార్లు నాటాల్సి వచ్చింది. రైతులపై అదనపు భారం తప్పలేదు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సరిపడా వర్షాలు లేక తెగుళ్లు సోకి పంట ఎదగలేదు. ఇప్పుడు దిగుబడి బాగా పడిపోయింది. ఇప్పుడిప్పుడే పత్తి తీసి విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకువస్తున్నా ధరల రూపంలో కలిసి రావడం లేదు. పంట బాగుంటే మూడు విడతలుగా పత్తి తీసేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఒకటి, రెండు పర్యాయాలకే పొలం మొత్తం ఖాళీ అవుతోంది. చెలక నేలల్లో ఎకరానికి 10 నుంచి 12 క్వింటాళ్లు, నల్లరేగడి నెలల్లో 15 నుంచి 20 క్వింటాళ్లు వరకు దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 5 క్వింటాళ్లు కూడా రావడం లేదు. మార్కెట్‌లో ధర అంతగా ఉండటం లేదు. గత ఏడాది ఇదే సీజన్‌లో క్వింటాల్ పత్తి రూ.9 వేలు నుంచి రూ.10 వేలు పలికింది. ఈసారి రూ.6,500 నుంచి రూ.7,830కి చేరుకొని మళ్లీ తగ్గుముఖం పట్టింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్ రూ.7,020 ఉంది.

గతేడాది ధరలు..

గతేడాది మరింత ధరలు పెరిగే అవకాశం ఉందనే ఆలోచనతో ఇప్పటికి ఇళ్లలో నిల్వచేసిన పత్తి రంగు మారడంతో మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.6 వేల నుంచి రూ.6,500 వరకు కొనుగోలు చేస్తున్నారు. గతేడాది పత్తి కొనుగోలు ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.8,000 – 9,500 వరకు మద్దతు ధర పలికింది. పత్తి నిల్వ చేసుకోవడంతో క్వింటాల్ వెంట రూ.3 వేలు తక్కువగా అమ్ముకోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

పెట్టుబడి కూడా రాదు



12 ఎకరాల్లో పత్తి వేశాను. కానీ, ఈసారి వర్షాలు లేక పత్తి పంట దెబ్బతింది. దిగుబడి తగడంతో ఎకరాకు 5 క్వింటాళ్లు వచ్చింది. కానీ, ఇప్పుడున్న ధరకు అమ్మితే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ధర పెరుగుతుందని అమ్మకుండా అలాగే పెట్టుకున్నాను. గతేడాది నిల్వ చేసిన పత్తిని తక్కువ ధరకే అమ్ముకోవడంతో తీవ్రంగా నష్టపోయాను. ఈ ఏడాది మరింత ధరలు పెరుగుతాయనే ఆశతో ఇంట్లో నిల్వ ఉంచుకున్నాం.

– మల్లారెడ్డి, పత్తిరైతు, మరికల్

రూ.10 వేలు ఉండాలి



పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా క్వింటాల్ పత్తికి మార్కెట్‌లో రూ. 10వేలు ఉంటేనే ఏమైనా లాభాం వస్తోంది. లేకుంటే నష్టాలు రావడం ఖాయం. ప్రస్తుతం పదిరోజుల నుంచి పత్తి ధరలు మార్కెట్‌లో స్థిరంగా పెరుగుతుండటంతో పత్తిని అమ్మాల వద్ద అనే ఆలోచనలో ఉన్నాం. ధర పెరిగిన తర్వాత అమ్మాలని ఇంట్లోనే నిల్వ చేశాం.

– శ్రీనివాస్, పత్తిరైతు, ఇబ్రహీంపట్నం

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జనార్దన్‌రెడ్డి

నారాయణపేట రూరల్: విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు ప్రతి ఒక్కరూ క్రీడలకు సమయం కేటాయించాలని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యాద్గీర్ జనార్దన్‌రెడ్డి అన్నారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా పట్టణంలోని మినీస్టేడియం గ్రౌండ్‌లో జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణ స్థాయి పాఠశాల, కళాశాల క్రికెట్ పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడుతూ.. మనిషి జీవితంలో వ్యాయామానికి మించిన మెడిసిన్ లేదన్నారు. ఆటలతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. క్రీడా కోటలో సైతం ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత చదువుకు సీట్లు పొందె అవకాశం ఉంటుందన్నారు. అనంతరం లాంఛనంగా మొదటి మ్యాచ్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ, నిర్వహకులు చిన్న పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తా..

మాగనూర్: నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. శనివారం మండల కేంద్రంలోని నాయకులు నర్సింహారెడ్డి నివాసంలో ఆయా మండలాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని ప్రజలంతా ఎదురుస్తున్నారని అన్నారు. అనంతరం పార్టీలో పలువురు వివిధ పార్టీల నాయకులు చేరారు.

బీజేపీ అభ్యర్థి ప్రచారం

నారాయణపేట రూరల్ / మరికల్: పట్టణంలోని వివిధ వార్డుల్లో బీజేపీ అభ్యర్థి రతంగపాండు రెడ్డి గెలుపునకు నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ మేరకు.. వారు కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే కలిగే నష్టాలను వివరించారు. మరికల్‌లో బీజేపీ అభ్యర్థి రతంగపాండురెడ్డిని గెలిపించాలని శనివారం ఆయా గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచా రం చేశారు.

విశ్వరూప మహాసభకు తరలిన నాయకులు

మాగనూర్/ధన్వాడ/ఊట్కూరు: ఎస్సీ వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన మాదిగల విశ్వరూప మహాసభకు మాగనూర్ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ కోకన్వీనర్ గజ్జపతి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించే విషయమై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహాసభలో మాదిగలకు హామీ ఇవ్వనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఊట్కూర్ మండల నుంచి విశ్వరూప మహాసభకు తరలిన వారిలో దళిత సంఘాల నాయకులు తిమ్మప్ప, దశరథ్, ప్రశాంత్, శ్రీకాంత్, మల్లేష్, నవీన్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా ధన్వాడ మండల కేంద్రం నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు బస్సుల్లో తరలివెళ్లారు. తరలి వెళ్లిన వారిలో శంకర్, బాల్‌రాజు, ఉస్సెన్నయ్య, హన్మంతు, భరత్, తిప్పయ్య, ఆంజనేయులు, వెంకటేష్, బాలకృష్ణ, సాయిలు, రాములు, తిమ్మయ్య,బాలకిష్టయ్య, రాములు తదితరులు ఉన్నారు.



మాగనూర్ నుంచి సభకు తరలుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొనుగోలు కేంద్రాలు ఏవీ?

- కల్లాల వద్దే దళారుల వ్యాపారం
- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బందులు



కల్లాల వద్దే వడ్లు కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు

అమరచింత: వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుంచి నేరుగా వరి ధాన్యం కొనుగోలు చేస్తామన్న ప్రభుత్వ అధికారుల ప్రకటనలు కేవలం పత్రికలకే పరిమితమయ్యాయి. మండలంలో ఇప్పటికీ వరి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో దళారులు రైతుల పంట పొలాలకు వద్దకే వెళ్లి కల్లాల నుంచే వరిధాన్యం కొనుగోలు చేస్తున్న పరిస్థితులు దాపరించాయి. ప్రభుత్వం వరికి రూ.2,250 మద్దతు ధర ఇస్తున్నామని ప్రకటించారే తప్పా ఇప్పటి వరకు ఒక్క కొనుగోలు కేంద్రం సైతం ఏర్పాటు చేయలేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయిస్తున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అకాల వర్షాలతో..

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ ఆయకట్టు పరిధితో పాటు అమరచింత ఎత్తిపోథల పథకం ఆయకట్టులో వరికోతలు ప్రారంభమయ్యాయి. దీంతో కల్లాల్లో వరిధాన్యం ఆరబెట్టుకోవడానికి వాతావరణం అనుకూలించకపోవడం, అకాల వర్షాల కారణంగా తక్కువ ధర వస్తున్న తమ వరిధాన్యం ను అమ్ముకోవాలనే తాపత్రయంతో తక్కువ ధరకే దళారులకు ధాన్యం విక్రయించి రైతులు నష్టపోతున్నారు. ప్రైవేట్ వ్యాపారులు సన్నరకం వరికి రూ.2,100, దొడ్డు రకానికి రూ.1,850 చెల్లిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఆయా మండలాల్లో వరికోతలు జోరందుకున్నాయన్న విషయాలను తెలుసుకున్న ప్రైవేట్ వ్యాపారులు వరి కొనుగోళ్లపై దృష్టి సారించి, సేకరించిన ధాన్యాన్ని కర్ణాటక రాష్ట్రానికి తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దళారీ వ్యవస్థను రూపుమాపి ప్రభుత్వ పరంగా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ముదిరాజ్‌లకు న్యాయం చేసే పార్టీకే మద్దతు

మరికల్: ముదిరాజ్‌లను బీసీ డి నుంచి బీసీ ఏలో చేర్చే పార్టీకే తమ మద్దతు ఇస్తామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, నాయకులు ఆంజనేయులు, శేఖర్ అన్నారు. మండలంలోని శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు.. కాంగ్రెస్ ప్రకటించిన మెనిఫెస్టోలో ముదిరాజ్‌లను బీసీ డి నుంచి బీసీ ఏలో చేరుస్తామని ప్రకటించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, తిరుపతయ్య, రామకృష్ణ, మొగులప్ప, సత్యన్న, యాదయ్య పాల్గొన్నారు.

నాసిరకంగా ఎఫ్‌ఎస్‌సీపీపీ నిర్మాణ పనులు



మస్తీపురం శివారులో నిర్మిస్తున్న ఎఫ్ఎస్ సీపీపీ పనులు

అమరచింత: మస్తీపురం శివారులో అమరచింత మున్సిపాలిటీకి సంబంధించి ఎఫ్ఎస్‌సీపీపీ నిర్మాణ పనులు నాణ్యతకు విరుద్ధంగా కొనసాగుతున్నాయి. వీటి కోసం ప్రభుత్వం రూ.35 లక్షలు మంజూరు చేయడంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ రెండు నెలల క్రితం పనులను ప్రారంభించారు. ప్రతినిత్యం మున్సిపల్ ఏఈ పర్యవేక్షణలో పనులు జరగాల్సి ఉండగా కేవలం కాంట్రాక్టర్ నియమించుకున్న సూపర్‌వైజర్ తోనే పనులు చేపడుతున్నారు. నాసిరకం సిమెంటుతో పాటు ఇసుకకు బదులుగా డస్ట్ వాడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని మరుగుదొడ్ల నుంచి వేస్టేజీని తీసుకెళ్లి వాటి ద్వారా ఎరువులను తయారు చేయడానికి వీలుగా నిర్మిస్తున్న పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేక నాసిరకంగా పనులు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు నాణ్యతగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

బొడ్రాయి పండుగను విజయవంతం చేద్దాం

అమరచింత: పట్టణంలో ఈనెల 14 నుంచి 16 వరకు నిర్వహించే బొడ్రాయి పండుగను జయప్రదం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ కోరారు. పట్టణంలోని మార్కండేయ ఆలయ ఆవరణంలో శనివారం బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఉత్సవాల నిర్వహణ గురించి సమీక్ష నిర్వహించారు. ఈమేరకు మాట్లాడుతూ 13న సాయంత్రం బొడ్రాయిని పట్టణ పురవీధుల గుండా భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 14న గణపతి పూజ జలాదివాసంతో కార్యక్రమాలు ప్రారంభవుతాయన్నారు.15న యాగశాలలో హోమపూజ, మధ్యాహ్నం బొడ్రాళ్లను ఇంటి ఆడపడుచులు అందరితో ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 16న ఉదయం 9:15 నుంచి 10 గంటల మధ్య ఏకకాలంలో బొడ్రాళ్ల ప్రతిష్ఠాపన జరుగుతుందని పేర్కొన్నారు. పవిత్రంగా నిర్వహించే ఉత్సవాల సందర్భంగా గ్రామంలో మూడు రోజుల పాటు మద్యం, మాంసం నిషేధిస్తున్నామని ఇందుకు పట్టణ ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తాటికొండ రమేష్, వెంకటరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నాగభూషణంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

ఘనంగా అబుల్‌కలాం ఆజాద్ జయంతి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: స్వాతంత్ర్య సమరయోధులు, దేశ ప్రథమ విద్యాశాఖా మంత్రి అబుల్ కలాం ఆజాద్ జయంతిని శనివారం పట్టణంలోని మైనార్టీ గురుకుల, మాడ్రన్ స్కూల్, శ్రీహంస వాహిని ఉన్నత పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఆయన విద్యాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. ప్రతి విద్యార్థి ఆజాద్ ఆశయసాధను కృషిచేయాలని పిలుపునిచ్చారు. కష్టపడి చదివితే ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. అనంతరం నృత్యాలు, నాటక ప్రదర్శనలు నిర్వహించారు. చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్ ఖాజా మహబూబ్‌ఖాన్, ఖదీర్, రాజేష్‌కుమార్, టీచర్లు కాసీం హుస్సేన్, శివకుమార్, ఫయాజుద్దీన్, జహంగీర్, శివశంకర్, హరీష్, మునీర్, సంతోష్, సుజాత, తిరుపతి, నర్సింహులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకోవడం మనందరి బాధ్యత



ప్లకార్డుతో విద్యార్థుల ప్రదర్శన

మాగనూర్: ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పాఠశాల ప్రిన్సిపాల్ మహేశ్వరి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీ ప్రతిభ విద్యానికేతన్ ముందస్తుగా దీపావళి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రకృతిని కాపాడుకునేందుకు టపాకాయలు బాణసంచా కాల్చకూడదని అన్నారు. అనంతరం విద్యార్థులచే ప్లకార్డుల ప్రదర్శన చేయించారు. ప్రకృతి అనేది అమ్మలాంటిదని ప్రతి సహజ వనరులనుంచి లభించే వాటినుంచి అరుదైన ఔషధాలు తయారుచేయనున్నట్లు తెలిపారు. అనంతరం దీప ప్రజ్వాలన చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

దామరగిద్ద: అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్. రాజేందర్‌రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రచారంలో భాగంగా ఇంటింటికీ తిరిగి మహిళలు, రైతులు, చేనేత కార్మికులు అన్నివర్గాల ప్రజలను కలిసి కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టనున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆయాగ్రామాల కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాతో సత్కరించి పార్టీలోకి ఆహ్వానించారు.

క్రికెట్ టోర్నీ విజేత స్వామినారాయణ గురుకుల్



ట్రోఫీ అందుకుంటున్న విజేతలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ఎండీసీఏ మైదానంలో జరుగుతున్న 2వ జలజం సత్యనారాయణ క్రికెట్ టోర్నీ శనివారం ముగిసింది. విజేతగా శ్రీస్వామినారాయణ గురుకుల్ జట్టు, రన్నరప్‌గా లిటిల్ స్కాలర్స్, మూడోస్థానంలో గెలాక్సీ పాఠశాల జట్లు నిలిచాయి. ఫైనల్ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లిటిల్ స్కాలర్స్ నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లకు 60 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీస్వామినారాయణ గురుకుల 8.5 ఓవర్లలో 4 వికెట్లకు 63 పరుగులు చేసింది. మూడో స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఫాతిమా విద్యాలయం 6 ఓవర్లలో 7 వికెట్లకు 38 పరుగులు చేయగా. అనంతరం బ్యాటింగ్ చేసిన గెలాక్సీ 4.1 ఓవర్లలో 3 వికెట్లకు 39 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా సాయిరాం (లిటిల్ స్కాలర్స్ స్కూల్), బెస్ట్ బౌలర్‌గా ఉమర్ (ఫాతిమా విద్యాలయం), బ్యాట్స్‌మెన్‌గా చరణ్‌తేజ్ (శ్రీస్వామి నారాయణ గురుకుల్), కీపర్‌గా హసన్ మిర్జా (లిటిల్ స్కాలర్స్) మెమొంటోలు అందుకున్నారు. జట్లకు ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ తదితరులు ట్రోఫీలు అందజేశారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఎండీసీఏ లీగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఎండీసీఏ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, కోచ్ గోపాలకృష్ణ, వైశేషిరాయ్, విదూషీ రాయ్, పాఠశాల ప్రిన్సిపాల్ రవీందర్, పీఈటీలు వినోద్‌కుమార్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.